ఈవారం కథ

# దేవుళ్ళుంటారు

అవసరాల శంకర నారాయణ రావు

"మనుషులు ఎన్నో రకాలుగా చీలిపోతున్నారు. మతం, కులం, భాష, ప్రాంతం, రంగు, రూపం ఇవి మనుషుల్ని చీల్చే పదునైన కత్తులు. ఇవా చాలవన్నట్లు మరిన్ని చీలికలు కల్పించుకుంటున్నారు. మనుషులు ఒకరిభావాన్ని మరొకరితో చెప్పకోవడానికి కూడా సంశయించేంతగా ఈ చీలికలు అడ్డుగోడలుగా నిలబడుతున్నాయి" సత్యమూర్తి గట్టిగా నిట్టూర్చాడు.

అంతకుముందు చెప్పినదానికి ముగింపు ఇదన్నమాట అనుకుంది పార్వతి. శివరావు మౌనంగా సత్యమూర్తి ముఖంలోకి చూశాడు.

"నేను మీకు కష్టం కలిగించి వుంటాను. నేను చెప్పదలుచుకున్నది చేప్పేశాను. అది నా బలహీనత" తల దించుకున్నాడు సత్యమూర్తి.

పార్వతి, శివరావు ఇద్దరూ ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు. పార్వతి ముఖం చిరచిర లాడుతోంది. ఆమెలో సహనం క్రమక్రమంగా తగ్గుతోందనడానికి సూచన అది.

సత్యమూర్తి తలపైకెత్తి "ఇచ్చేవాడుంటేనే పుచ్చుకునే వాడికి అవకాశం. అందుకే నాకు ఇచ్చే వాళ్ళంటే కోపం. పుచ్చుకొనే వాళ్ళపట్ల జాలి. ఎందుకంటే అది వాళ్ళ బలహీనత. ఇచ్చే వాళ్ళ సంఖ్య ఎక్కువ కావడంతో తీసుకునే వాళ్ళకి బలం హెచ్చింది. చివరికి ఇంతెందుకివ్వరు? అనే స్థాయికి చేరింది. ఇది సామాజిక నైచ్యం."

పార్వతి ఇంక వుండబట్టలేకపోయింది. "మీలాగా మెట్ట వేదాంతం వల్లించే వాళ్ళు తమ విషయానికొచ్చే సరికి తలవంచక తప్పదు. అప్పుడు ఈ నీతులు నీటిలో కొట్టుకుపోతాయి. మీలాంటి వాళ్ళంతా తాము చేసిన తప్పలు కప్పిపుచ్చుకునేందుకు, తమ అభిప్రాయాలు ఎదుటివాళ్ళపై బలవంతాన రుద్దాలని ప్రయత్నిస్తారు. చివరికి ఓడిపోతారు" తన కసి, కోపము తీరిందన్నట్టుగా కుర్చీలో వెనక్కి వాలింది.

సత్యమూర్తి చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో ఎంతో సంయమనం. అది పార్వతికి చిర్రెత్తిస్తుంటే, శివరావుకి ఆశ్చర్యం కలిగించింది. ఈ సందర్భంలో మరో మనిషి అయితే గట్టిగా అరుస్తాడు. కానీ, సత్యమూర్తి నవ్వుతాడు.

"అక్కయ్యగారూ! నిజాన్ని ఒప్పకో



వాలంటే గుండె ధైర్యం, సంస్కారం కావాలి" సత్యమూర్తి నవ్వుతూనే అన్నాడు.

"అంటే.. నాకు ఆ ధైర్యం, సంస్కారం లేవనా? అయినా నువ్వెవరు నాకు చెప్పడానికి? మా పిల్ల 'మా ఇష్టం" అనేసింది.

సత్యమూర్తి ముఖంలో రంగులు మార్హాయి. ఇందాకటి నవ్వు స్థానంలో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. అతనలా ఎప్పుడూ కనిపించలేదు. శివరావు మనసు చివుక్కుమంది. గతంలో వాదనలు జరిగినా పార్వతి ఇలా ఎప్పుడూ మాట్లాడలేదు.

సత్యమూర్తి లేచి తలదించుకువెళ్ళిపోయాడు. ఆ ఇంట్లోంచి అతను ఎప్పుడూ అలా వెళ్ళలేదు. శివరావు అతని వెనకే గుమ్మం వరకూ వెళ్ళాడు. సత్యమూర్తి స్కూటర్ స్టార్ట్ చేసిన చప్పుడు విని, పార్వతి సోఫాలోంచి లేచింది.

శివరావు లోపలకొచ్చాడు. "మీరెందుకలా అయిపోతారు? పిల్లకి పెళ్ళి నిశ్చయమైందని చెబితే, శుభ వచనాలు పలక్కుండా మనమేదో తప్పు చేసినట్టు వాగుతాడేంటి? కట్నం ఇవ్వడం ఈ రోజుల్లో మామూలయిపోయింది. దాన్ని సామాజిక నైచ్యం అంటాడు. అంటే మనమంతా నీచులమా?" పార్వతి ఆవేశంగా భర్త మొహంలోకి చూస్తూ అంది.

పార్వతిలో అంత ఆవేశం మొదటిసారిగా చూస్తున్నాడు శివరావు. "ఇది వరకూ అలాగే దేవుడు గురించి వాదించాడు. జ్ఞానం లేని భక్తి మూఢత్వం అవుతుందన్నాడు. అంటే నేను మూఢురాలిననేగా అతని ఉద్దేశం. నాకు చాలా రోజులనుంచి ఇతని మీద కోపంగా వుంది. ఏదో మీ ఫ్రెండ్ కదా అని గౌరవించాను. మరొకళ్ళయితే..."

శివరావు చటుక్కున ఆమెవైపు చూశాడు.

"సరేలెండి! ఇక ఈ విషయం ఇంతటితో వదిలేద్దాం. ఇక అతను మన గడప తొక్కకుండా చేశాను. నాకు సంతోషంగా వుంది" అంది పార్వతి.

సత్యమూర్తి ప్రాక్టికల్‌గా ఆలోచించే మనిషి. కులాంతర వివాహం చేసుకున్నాడు. అందులో కట్నం ప్రసక్తే లేదు. అందరూ వ్యతిరేకిస్తున్న దారిలో

"ఇచ్చే వాడుంటేనే పుచ్చుకునేవాడికి అవకాశం. అందుకే నాకు ఇచ్చేవాళ్ళంటే కోపం. పుచ్చుకునే వాళ్ళ పట్ల జాలి, ఎందుకంటే అది వాళ్ళ బలహీనత. ఇచ్చే వాళ్ళ సంఖ్య ఎక్కువ కావడంతో తీసుకునే వాళ్ళకు బలం హెచ్చింది. చివరికి 'ఇంతెందుకు ఇవ్వరు?' అనే స్థాయికి చేరింది. ఇది సామాజిక నైచ్యం."



తను ప్రయాణం చేస్తున్నాడు. ఆడవాళ్ళే తమలో వుండే ఇగోని తృప్తిపరచుకుందుకు, ఈ కట్నాలు, కానుకలు, లాంఛనాలు అంటూ బాధాకరమైన ఈ సంప్రదాయాలను పెంచి, పోషిస్తున్నారని అతని భావన. అందుకే ఆడవాళ్ళలో ఆ సంప్రదాయాలపట్ల వ్యతిరేకత రావాలని వాదిస్తాడు. దైవాన్ని పూజించడంకన్నా ధ్యానించడం ఉత్తమం అంటాడు. మనిషి దైవంగా మారాలంటాడు.

శివరావు, సత్యమూర్తి గురించి ఆలోచించాడు. ఇక అతను తమ ఇంటికి రాడు. గట్టిగా నిట్టూర్చాడు.

xx xx xx xx

"ఏవండీ! ముహూర్తానికి ఇంకా నాలుగు రోజులే వుంది. అన్ని పనులూ పూర్తయినట్టేగా?" అడిగిందది పార్వతి.

"ఆ.... అన్నట్టు మరిచాను. మీ అన్నయ్యా వాళ్ళింటికెళ్ళి వంట వాడికి మరో మారు కబురు చెయ్యాలి. అడ్వాన్స్ ఇస్తే ఆ పని పూర్తయినట్టే" అన్నాడు శివరావు.

"మీరన్నీ ఇలాగే మర్చిపోతారు. మీ ఆఫీసులో లోను డబ్బు తెచ్చారా? అదీ మర్చిపోయారా?"

"తెచ్చాను. బ్యాంకులో వేద్దామంటే టైం అయిపోయింది. సాయంత్రానికి గాని డబ్బు అందలేదు. 'సరేలే! త్వరగా బయలుదేరు. నేను ఈ లోపున కళ్యాణ మండపం దగ్గర కెళ్ళొస్తాను" అన్నాడు.

"అలాగే ఆ సప్లయర్స్ వాడికో మారు గుర్తు చెయ్యండి." అంది పార్వతి.

"సరే, సరే! నువ్వు త్వరగా తెమిలి రెడీగా వుండు" అని శివరావు బయటకెళ్ళాడు.

పట్నానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న కాలనీలో వుంటున్న పార్వతి అన్నగారింటి కెళ్ళేసరికి రాత్రి ఎనిమిదయింది. భోజనాలయ్యాక అందరూ పెళ్ళి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఈ రాత్రికి ఇక్కడ వుండిపోండి. అమ్మాయి అత్తవారింటికెళ్ళిపోతే ఇప్పట్లో మళ్ళీ చూడ్డం కుదరదు కదా!" అంది పార్వతి వదినగారు.

ఆ రాత్రికి అక్కడే వుండి పొద్దుటే బయలుదేరి ఇంటికి వచ్చారు. తాళం తీసి ముందుగా పార్వతి మధ్య గదిలోకెళ్ళింది.

"ఏవండీ..." అని గట్టిగా అరిచింది.

బూట్లు విప్పుకుంటున్న శివరావు ఏమయిందోనని గాభరగా లోపలకెళ్ళాడు. తెరిచి వుంచిన బీరువా, ఎదురుగా కిందనే కూర్చుని తలమీద చేతులు పెట్టుకున్న పార్వతి కనిపించారు.

"ఏమయ్యింది పార్వతీ!... అంటూ ఆమె ప్రక్కనే కూర్చున్నాడు.

"అమ్మా... అమ్మా..." అని కూతురు దివ్య కదిపింది.

"అంతా అయిపోయిందండీ" అంటూ బీరువా వైపు చూపిస్తూ, అతని ఒళ్ళో వాలిపోయింది.

శివరావుకి అర్థమైంది. పార్వతిని మంచం మీద పడుకోబెట్టాడు. ఇల్లంతా కలయచూశాడు. ఇంట్లో దొంగతనం జరిగింది. పెరటి తలుపులు గట్టిగా బాదడంతో గొళ్ళెం ఊడిపోయింది. బీరువా హాండిల్ ఊడి కిందపడుంది. బీరువా తలుపు మీద గట్టిగా గునపం లాంటి దానితో బాదడం వల్ల లోతైన సొట్టలు పడివున్నాయి.

శివరావు తేరుకున్నాక, పోలీస్ కంప్లయింట్ చేశాడు.

పార్వతికి మధ్యాహ్నందాకా స్పృహ రాకపోయేసరికి ఆస్పత్రిలో చేర్చాడు.

రాత్రి మెలకువ వచ్చింది. "ఏవండీ! మన డబ్బు పోయినట్టేనా? మొత్తం పాతిక వేలు. ఎలాగండీ? పెళ్ళి ఆగిపోతుందా?" అంటూ మళ్ళీ స్పృహ తప్పిపడిపోయింది.

రెండు రోజులు అలాగే జరిగింది. "దొరుకుతుంది పార్వతీ! పోలీస్ కంప్లయింట్ ఇచ్చానుగా!" అంటున్నాడే గాని అదెలాగో అతనికీ అర్థం కాలేదు.

"ఆవిడకి ఆ డబ్బు దొరికిందని తెలిస్తే గాని కుదుటపడడం కష్టం. బాగా షాక్ తిన్నారు" అన్నారు డాక్టర్.

ఆ మర్నాడు పార్వతి కళ్ళు విప్పేసరికి ఎదురుగా శివరావు నవ్వుతూ కనిపించాడు. "మన డబ్బు దొరికింది పార్వతీ!" అన్నాడు. పార్వతికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది. ఆమె కళ్ళు మెరిసాయి.

అనుకున్న ముహూర్తానికి పెళ్ళి జరిగింది.

"మన పట్ల భగవంతుడున్నాడండీ!" అంది పార్వతి.

"కాదు పార్వతీ! దేవుడులాంటి మనిషున్నాడు. సత్యమూర్తి, 'అక్కయ్యగారు నేనిచ్చానని చెబితే తీసుకోకపోవచ్చు. డబ్బు దొరికిందని చెప్పండి' అన్నాడు. కనీసం నోటు కూడా రాయనివ్వలేదు. 'మనిషి యందయినా, దేవుని యందయినా వుండవలసింది నమ్మకంగాని కాగితాలు కావు' అన్నాడు. 'నాకు బాధించే సంప్రదాయాలపట్లే ద్వేషం గాని, మనుషుల మీద కాదని చెప్పండి' అన్నాడు పార్వతీ!" అంటూ శివరావు ఆమెవైపు చూశాడు.

"ఆలయాల్లోనూ, దేవుడి పటాల్లోనూ వుండేది కేవలం దైవ భావన మాత్రమే! అసలైన దైవం మనిషిలోనే వున్నాడు" అన్న సత్యమూర్తి మాటలు ఆమెకి గుర్తు వచ్చాయి.

"తమ్ముడూ.." అనబోయి, ఆ పిలుపుకి అందనంత ఎత్తుకు ఎదిగిపోయిన సత్యమూర్తిలో దైవాన్ని చూసింది. మనిషిలోని దైవాంశ ఆమెకి కనిపించింది. చేతులెత్తి నమస్కరించి, 'అవును, మనుషుల్లో దేవుళ్ళుంటారు' అనుకుంది పార్వతి. ■